క్లుప్తంగా

మొరాయించిన స్కూల్ బస్సు



పాఠశాల బస్సును తోస్తున్న విద్యార్థులు

శ్రీకాళహస్తి: ఓ ప్రైవేటు స్కూల్‌బస్సు మొరాయించడంతో అందులో ఉన్న విద్యార్థులు దిగి ఆ బస్సును నెట్టాల్సి వచ్చింది. పట్టణంలో మంగళవారం ప్రైవేటు స్కూల్ బస్సు హఠాత్తుగా నడిరోడ్డుపై ఆగిపోయింది. డ్రైవర్ ఎంత ప్రయత్నించినా బస్సు ముందుకు కదల్లేదు. దీంతో విధిలేక బస్సులోని విద్యార్థులందరూ కిందకు దిగి ఆ బస్సును ముందుకు తోసి ఆ తరువాత ఎక్కి వెళ్లారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు వేసవి నేపథ్యంలో స్వామి అమ్మవార్ల దర్శనం కోసం క్యూలో ఉండే భక్తులకు మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సతీష్‌మాలిక్, సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్, ఆలయ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీపై వ్యవసాయ పనిముట్లు పంపిణీ



వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద మంగళవారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రైతులకు రాయితీపై ట్రాక్టర్ నాగళ్లు, రోటోవేటర్, స్ప్రెయిర్లను పంపిణీ చేశారు. బుచ్చినాయుడుకండ్రిగ, పద్మావతీపురంలో సీసీ రోడ్లను ప్రారంభించారు. పీహెచ్‌సీని తనిఖీ చేశారు. పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, వ్యవసాయాధికారి భారతి, ఏపీఎం మునెయ్య, పీఆర్ ఏఈ నాగరాజు, రవినాయుడు, కార్తీక్‌నాయుడు, మునిచంద్రా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

భావనారుషి ఉత్సవాలకు గణపతిపూజ



గణపతి పూజ నిర్వహిస్తున్న అర్చకులు

నారాయణవనం : మండలంలో పాలమంగళం ఉత్తరంలోని శ్రీభద్రావతి సమేత భావనారుషి స్వామి ఆలయంలో ఉత్సవాలు మంగళవారం గణపతిపూజతో ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయంలో మూలవర్లకు అభిషేకాలు, నిత్యకైంకర్య పూజలు చేసి మహా నైవేద్యం సమర్పించారు. సాయంత్రం యాగశాలలో హోమాది కార్యక్రమాలు చేపట్టారు. బుధవారం ఉదయం అభిషేకం, భద్రవతీ అమ్మవారితో కల్యాణోత్సవం, రాత్రి వ్యాఘ్ర వాహనంపై ఊరేగింపు నిర్వహిస్తారు. గురువారం మధ్యాహ్నం మహానైవేద్యం, సాయంత్రం చక్రస్నానంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని ఉత్సవ కమిటీ తెలిపింది. ఉభయదారులు, గ్రామస్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పిల్లలను అంగన్‌వాడీ స్కూల్లో చేర్చండి



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న సర్పంచ్ మోహనప్రియ

ఏర్పేడు(రేణిగుంట): పిల్లలను అందరూ అంగన్‌వాడీ స్కూళ్లకు పంపాలని ఎండీ పుత్తూరు సర్పంచ్ కందాటి మోహనప్రియ కోరారు. పంచాయతీ పరిధిలోని మిట్ట ఇండ్లు, ఎస్టీ కాలనీలలోని మంగళవారం తల్లిదండ్రులతో మాట్లాడారు. అయితే రెండు కిలోమీటర్ల దూరం పిల్లలను గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి పంపేందుకు ఇబ్బందిగా ఉందని, ఇక్కడే మినీ అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేస్తే తమకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. అయితే ఈ సమస్యను తాను ఇప్పటికే మండల మీట్‌లో అధికారుల దృష్టికి తీసుకెళ్లానని, మినీ అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభమయ్యే వరకు పిల్లలను గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి పంపాలని ఆమె కోరారు.

పది అయిపోయిందోచ్..!



పది పరీక్షలు రాసిన ఆనందంలో కేరింతలు కొడుతున్న విద్యార్థులు

- ముగిసిన పరీక్షలు
- ఉత్సాహంగా పరీక్ష కేంద్రం నుంచి వెలుపలికి..
- సెలవుల్లో వివిధ కోర్సుల శిక్షణ పొందేందుకు ఆసక్తి

సత్యవేడు: గత నెల 17 నుంచి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు మంగళవారం ముగిశాయి. దీంతో విద్యార్థులు పరీక్ష కేంద్రాల నుంచి ఉత్సాహంగా వెలుపలికి వచ్చారు. ఇన్నాళ్లు కష్టపడి చదివిన విద్యార్థులు పరీక్షలుఅయిపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. పరీక్షలు బాగా రాశామని, అధిక మార్కులుతో పాస్ అవుతామని ఉపాధ్యాయులకు వారు చెప్పారు. కేంద్రం వద్దే కొంతసేపు తమ మిత్రులతో ఆనందంగా గడిపారు. టెన్త్ పాసైతే ఇంటర్ ఎక్కడ చేరేది, ఏ గ్రూపు తీసుకునేది మాట్లాడుకున్నారు. సెల్ నంబర్లు ఇచ్చి పుచ్చుకొన్నారు. ఇక మళ్లీ ఎప్పుడు కలుస్తామోనని ఒకింత భారంగా తమ జ్ఞాపకాలు పంచుకున్నారు. ఇంటర్మీడియెట్‌లో ఒకేచోట చేరుదామంటూ మరికొందరు ధైర్యం చెప్పుకున్నారు. వేసవి సెలవులను వృథా చేయకుండా కంప్యూటర్ కోర్సు, పాలిటెక్నిక్ కోచింగ్, క్రీడల్లో శిక్షణ పొందే అవకాశాలపై ముచ్చటించుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు తమ భవిష్యత్తు ఆలోచనల గురించి 'సాక్షి'తో పంచుకున్నారు.

ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తా



పరీక్షలు బాగా రాశాను. సెలవులను వృథా చేయకుండా కోచింగ్ తీసుకుంటా. ఒక లక్ష్యంతో ఉన్నత చదువు చదువుతా. భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగం సాధించి తీరుతా.

-వి.దార్తిక, పుదుకుప్పం, తమిళం ఉన్నత పాఠశాల, సత్యవేడు మండలం.

టీచర్‌ని అవ్వాలన్నదే లక్ష్యం



పదో తరగతి పరీక్షలు బాగా రాశాను. మంచి మార్కులు సాధిస్తాను. ఇంటర్, డిగ్రీ, పీజీ చదివి టీచర్ అవ్వాలన్నదే నా లక్ష్యం. మా టీచర్లే నాకు ఇన్‌స్పిరేషన్. వారిలా మంచి విద్యార్థులను తీర్చిదిద్దుతా.

-ఆర్.హరిణి, పుదుకుప్పం, ప్రభుత్వ పాఠశాల, సత్యవేడు మండలం

డాక్టర్ కావాలని..!



పదో తరగతి పరీక్షలు బాగా రాశాను. భవిష్యత్తులో డాక్టర్ కావాలన్నదే లక్ష్యం. సెలవులను వృథా చేయకుండా దానికి తగినట్టు కోచింగ్ తీసుకుంటా.

-రుక్సానా, బాలికల హైస్కూల్, సత్యవేడు

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతా



ఇంటర్‌లో ఎంపీసీ గ్రూపు తీసుకుని మంచి మార్కులతో పాసై ఇంజినీరింగ్ చదువుతా. భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతా. అమ్మానాన్నలకు తోడుగా ఉంటా.

బి.పార్థు, బీసీ గురుకుల పాఠశాల, సత్యవేడు

ప్రశాంతంగా ముగిసిన టెన్త్ పరీక్షలు

నాగలాపురం: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్లస్‌లో పదవ తరగతి పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. మార్చి 17 నుంచి ప్రారంభమైన పరీక్షలు 31 న ముగియాల్సి ఉంది. అయితే 31న రంజాన్ పండుగ కావడంతో చివరి సబ్జెక్ట్ అయిన సోషల్ పరీక్ష 1వ తేదీకి వాయిదా పడింది. దీంతో మంగళవారం ఈ పరీక్ష నిర్వహించారు. ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఇవ్వకుండా పదవ తరగతి పరీక్షలు సజావుగా ముగించామని అధికారులు తెలిపారు. చివరి పరీక్ష రాసిన అనఅంతరం విద్యార్థులు కేరింతలు కొడుతూ కేంద్రం నుంచి బయటకు వచ్చారు.



పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

మద్యంతాగి వాహనాలు నడిపితే కేసులు

బుచ్చినాయుడుకండ్రిగ: మద్యం సేవించి వాహనాలను నడిపితే కేసులు నమోదు చేస్తామని బుచ్చినాయుడుకండ్రిగ సీఐ తిమ్మయ్య హెచ్చరించారు. మంగళవారం ఆయన స్థానిక చెక్ పోస్ట్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, మండలంలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక నిఘా పెడుతున్నట్టు తెలిపారు. వాహనదారులు మద్యం సేవించి డ్రైవింగ్ చేసినా, మితిమీరిన వేగంతో వాహనాలు నడిపినా, ఓవర్ లోడుతో వెళ్లినా చర్యలు తప్పవన్నారు. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు ఉంచుకోవాలన్నారు. అనంతరం ట్రాఫిక్‌పై దృష్టి సారించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు

నాగలాపురం: మహిళల్ని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే బాధ్యత వీవోలదేనని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం జీవనోపాధుల ప్రణాళికల తయారీపై వీఏఓ ఎన్యూమరేటర్లు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పీడీ మాట్లాడారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో రుణాల వినియోగం, సభ్యుల స్థితిగతులపై సర్వే చేయడం, ఇతర అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏసీ విజయమ్మ, ఏపీఎం చంద్రకళ, సీసీలు నాగేంద్రబాబు, సుబ్రమణ్యం, వీవోలు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

సన్మానం



మదన్‌గోపాల్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఇరిగేషన్ డివిజన్‌లో ఈఈ గా సేవలందించిన మదన్‌గోపాల్ మంగళవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈఈ మదన్‌గోపాల్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవనాయు డు, బర్రి సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



చికిత్స పొందుతున్న ఎస్ఐని పరామర్శిస్తున్న నూకతోటి రాజేష్

బుచ్చినాయుడుకండ్రిగ: రోడ్డు ప్రమాదంలో గాయపడి తిరుపతిలో చికిత్స పొందుతున్న ఎస్ఐ విశ్వనాథనాయుడును వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పరామర్శించారు. వైద్యులతో మాట్లాడారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కొణతనేని మణినాయుడు, జిల్లా సీనియర్ నాయకులు అరణి సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్మిక విభాగం అధ్యక్షుడు బీరేంద్రవర్మ, స్టేట్ ఎస్సీ సెల్ కార్యదర్శి ఉగ్గుమూడి గురునాథం, భానుప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుడిమల్లంలో కోటి



ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు మండలం గుడిమల్లం పరశురామేశ్వరాలయాన్ని మంగళవారం సాయంత్రం తెలుగు సినీ సంగీత దర్శకులు కోటి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈవో రామచంద్రారెడ్డి, మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం చేయించారు. తీర్థప్రసాదాలను అందజేశారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



తల్లికి బాలుడిని అప్పగించిన పోలీసులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట పట్టణంలో మంగళవారం సాయంత్రం మునిలక్ష్మి కుమారుడు తప్పిపోయాడు. తల్లి, బంధువులు ఆందోళన చెంది చుట్టుపక్కల వెదికారు. అంబేడ్కర్ విగ్రహం కూడలి వద్ద బాలుడు ఏడుస్తుండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బాలుడిని పోలీస్ స్టేషన్ తీసుకుని వెళ్లారు. సమాచారం అందుకున్న బాలుడి తల్లి మునిలక్ష్మి పోలీస్ స్టేషన్ చేరుకున్నారు. పోలీసులు బాలుడిని తల్లికి అప్పగించి పిల్లల్ని జాగ్రత్తగా సంరక్షించుకోవాలని సూచించారు.

తొట్టెల నిర్మాణానికి భూమి పూజ

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు మండలం బండారుపల్లిలో మంగళవారం ఉపాధిహామీ పథకంలో గోవుల నీటి తొట్టె నిర్మాణానికి ఏపీవో సుజాత భూమి పూజ చేశారు. రానున్న వేసవి దృష్ట్యా నీటి తొట్టెల నిర్మాణాలను ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో చేపట్టాలని నిర్ణయించిందన్నారు. ఈ మేరకు ప్రతి గ్రామంలోనూ ఆవులు, పశువుల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్టెలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. అయితే ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్‌కు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా టీడీపీ నాయకులతో కలసి ఏపీవో నీటి తొట్టెల నిర్మాణ పనులను ప్రారంభించడం విమర్శలకు తావిస్తోంది.

జీవనోపాధుల ప్రణాళిక తయారీపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీఎం మునెయ్య

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం 2025–2026 ఆర్థిక సంవత్సరంలో మహిళ సంఘాలు వార్షిక రుణ, జీవనోపాధుల ప్రణాళిక తయారు చేయడంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం మునెయ్య మాట్లాడుతూ, ఒక కుటుంబం, ఒక జీవనోపాధి లక్ష్యానికి అనుగుణంగా గ్రామ సంఘం అసిస్టెంట్లతో స్వయం సహాయక సంఘాల్లో 10వ తరగతి ఆపై చదివిన, ఆసక్తి కలిగిన మహిళలను గుర్తించి వారికి ప్రణాళిక తయారీపై శిక్షణ ఇస్తామన్నారు. ముఖ్యంగా ప్రతి సభ్యురాలు 2025–26లో సీఐఎఫ్, బ్యాంక్ లోన్, స్త్రీనిధి, ఉన్నతితోపాటు పీఏఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, పీఎంఎంఎస్‌వై, ఇతర కార్పొరేషన్ రుణాలు, వ్యక్తిగత రుణాలు ఏది.. ఏ నెలలో అవసరం? ఏ కార్యక్రమం చేపట్టబోతారు? ఏ లోన్లకు అర్హత ఉంది?..ఇత్యాది అంశాలపై విపులంగా చర్చించి ప్రణాళిక తయారు చేస్తామన్నారు. కార్యక్రమంలో సప్తగిరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ వెంకటరమణ, సీసీలు వెంకటరత్నం, వీరజిన్నప్ప, ఫీల్డ్ ఆఫీసర్ శరత్, అకౌంటెంట్ హిమగిరిజ పాల్గొన్నారు.

సత్యవేడులో..

సత్యవేడు: స్వయం సహాయక సంఘాల రుణ ప్రణాళికలో 70 శాతం నిధులను జీవనోపాధికి చూపాలని ఏపీఎం డాక్టర్ డాంగే యాదవ్ ఆదేశించారు. సోమవారం స్త్రీ శక్తి భవనంలో దాసుకుప్పం క్లస్టర్‌కు సంబంధించిన ఎన్యూమేటర్లకు రుణ ప్రణాళిక తయారీపై శిక్షణ ఇచ్చారు. ఏపీఎం మాట్లాడుతూ, 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జీవనోపాధి రుణ ప్రణాళిక తయారు చేయాలన్నారు. ప్రతి ఎన్యుమేటర్ ఐదు డ్వాక్రా సంఘాల సభ్యుల ఆర్థిక అవసరాలను గుర్తించి జీవనోపాధి ప్రణాళికను నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో వెలుగు కో–ఆర్డినేటర్ మంగయ్య, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల నిధుల మంజూరుకు వినతి



డీఈవోకు వినతిపత్రాన్ని అందిస్తున్న జెడ్పీటీసీ తిరుమలయ్య

ఏర్పేడు(రేణిగుంట): మండలంలో ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీగోడల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి చొరవ చూపాలని ఏర్పేడు జెడ్పీటీసీ కావేరి తిరుమలయ్య మంగళవారం డీఈవో ఎన్. వెంకట నాగేంద్రకుమార్‌ను కోరారు. మండలంలో 15 పాఠశాలలకు ప్రహరీగోడలు లేకపోవడంతో పాఠశాల భద్రత కరువైందని, అసాంఘిక కార్యక్రమాలు కూడా జరుగుతున్నాయని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సమగ్రశిక్ష ద్వారా అంచనా ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపిస్తామన్నారు. అనుమతులు వచ్చాక ప్రహరీగోడల నిర్మాణానికి చర్యలు చేపడతామని డీఈవో హామీ ఇచ్చినట్లు తెలిపారు.

వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి అడ్డంకులు

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు మండలం, పంగూరు దళితవాడలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని స్థానికుల విన్నవించడంతో తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తి నూతన వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి రూ.8లక్షలు మంజూరు చేయించారు. అయితే గ్రామంలో వాటర్‌ప్లాంట్ ఉందని, దళితవాడలో అవసరం లేదని సాకుచూపి టీడీపీ నాయకులు అక్కడ వాటర్‌ప్లాంట్ నిర్మాణం జరగనివ్వకుండా అడ్డుకుంటున్నారు. నిధులు మంజూరు చేసినా ప్లాంట్ నిర్మాణాన్ని దురుద్దేశంతో అడ్డుకుంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే అధికారులు టీడీపీ నాయకులకు వంతపాడుతూ తాగునీటి ప్లాంట్ నిర్మాణం చేపట్టకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు. గ్రామ సర్పంచ్ వల్లేటి లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ కొద్ది రోజుల కిందట గ్రామంలో తాగునీరు కలుషితమై విషజ్వరాలు ప్రబలాయని, స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని గ్రామస్తులతో కలసి ఎంపీ గురుమూర్తికి విన్నవించామని, ఆయన తక్షణమే స్పందించి రూ.8లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. అయితే గ్రామానికి చెందిన కొందరు టీడీపీ నాయకులు ప్లాంట్ నిర్మాణాన్ని అడ్డుకోవటం దారుణమన్నారు.

బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోండి



ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

శ్రీకాళహస్తి: నియోజకవర్గంలో విచ్చలవిడిగా ప్రతి పల్లెలో బెల్టు షాపులు నిర్వహిస్తున్నారని వీటిపై చర్యలు తీసుకోవాలని స్థానిక ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీపీఐ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య మాట్లాడుతూ ప్రభుత్వ లైసెన్సు పొందిన మద్యం దుకాణాల నుంచి తీసుకొచ్చి ప్రతి పల్లెలో మద్యం విక్రయిస్తున్నారన్నారు. ఈ బెల్ట్ షాపుల ద్వారా వచ్చిన ఆదాయం కూడా సరిపోదంటే, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ డోర్ డెలివరీ ఏర్పాటు చేస్తే ప్రభుత్వానికి అధికంగా ఆదాయం వస్తుందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మించల శివకుమార్, శ్రీనివాసులు, ప్రజానాట్య మండల నాయకులు చారుశీల, గురవయ్య ఏఐటీయూసీ నాయకులు మురళి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ



ఆర్ మల్లవరం సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీవో విష్ణు చిరంజీవి

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం ఆర్ మల్లవరం సచివాలయాన్ని మంగళవారం ఎంపీడీవో విష్ణు చిరంజీవి తనిఖీ చేశారు. సచివాలయంలో కార్యదర్శి మినహా మిగతా సిబ్బంది ఎవ్వరూ లేకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బంది అంతా ఏమయ్యారని ప్రశ్నించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పంచాయతీ పాలన అస్తవ్యస్తం



రేణిగుంట పంచాయతీ కార్యాలయం
సచివాలయం సిబ్బంది కొరత

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): మేజర్ పంచాయితీ రేణిగుంటలో పాలన అస్తవ్యస్తంగా ఉండడంతో చిన్నపాటి పనులు చేసుకునేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులకు ఎటువంటి ప్రాధాన్యత ఇవ్వకుండా అధికారపక్ష నాయకుల మాటలను పరిగణనలోకి తీసుకొని అధికారులను పంచాయతీలో నియమించుకోవడంతో సమస్య మొదలైంది. పంచాయతీ పాలకులు, ఎంపీటీసీలు ఉన్నా కూడా నామమాత్రంగానే ఉన్నారు. మొత్తం పాలనను స్థానిక టీడీపీ నాయకులు చేతుల్లోకి తీసుకుని అధికారులపై పెత్తనం చేస్తున్నారు. అధికార పార్టీలో మూడు వర్గాలు ఉన్నందున తలో మాట చెబుతుండడంతో ఎవరికి పనిచేయాలో తెలియని అయోమయ పరిస్థితుల్లో పంచాయతీ అధికారులు ఉన్నారు. అధికార పార్టీ నాయకుల బాగోగులు చూసుకుని దాంట్లోనే పంచాయతీ పాలనాధికారి సమయం గడిచిపోవడంతో సామాన్య ప్రజల బాగోగులు చూసుకునేవారు కరువయ్యారు. పంచాయతీలోని ఐదు సచివాలయాల్లో సిబ్బంది కొరత వల్ల ఎక్కడి పనులు అక్కడే అన్న చందంగా ఉన్నాయి. ఆధార్ అప్డేట్ చేసుకోవాలన్నా, రేషన్ కార్డు ఈకేవైసీ చేసుకోవాలన్న స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఐదు సచివాలయాలు అందుబాటులో ఉన్నప్పటికీ మండలంలోని మరొక పంచాయతీకి వెళ్లి పనులు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. సచివాలయ సిబ్బందిని నియమించి ప్రజలకు సకాలంలో సేవలు అందించాలని పలువురు కోరుతున్నారు.

ఎస్సీ సెల్ అధ్యక్షునికి సత్కారం



కృష్ణయ్యను సన్మానిస్తున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: నియోజవర్గ వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులుగా నియమితులైన పసల కృష్ణయ్యను మంగళవారం శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వయ్యాల కృష్ణారెడ్డి, మాజీ పాలకమండలి సభ్యులు సాధనమున్నా రాయల్, బుల్లెట్ జయశ్యామ్, మాజీ కౌన్సిలర్ ఉత్తరాది శరవణ కుమార్, కంట ఉదయ్ కుమార్, నియోజవర్గ యువత అధ్యక్షులు శ్రీవారి సురేష్, మైనారిటీ సెల్ అధ్యక్షుడు పఠాన్ ఫరీద్, వైఎస్సార్‌సీపీ నాయకులు కొల్లూరు హరినాథ్ నాయుడు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.